

# పిట్టకథ

అనగా అనగా ఓ కట్టెలు కొట్టుకునేవాడు...

అతడోరోజున యథావిధిగా చెరువుగట్టునున్న చెట్టెక్కి, కొమ్మలు నరుకుతూండగా గొడ్డలి కాస్తా చేయిజారి చెరువులో పడిపోయింది.

సరే, ఆ తర్వాతి కథ మనకు తెలిసిందేగదా!

అపుడు వాడు బహు సీరియస్‌గా నెత్తీ, నోరూ, గుండే, బాదుకుని "ఓ నా గొడ్డలీ!... హే నా బంగారు గొడ్డలీ!... నీవు లేక నేనెట్లు బ్రతుకగలనూ? ... అంటూ శాస్త్రోక్తంగా ఏడవ నారంభించేడు.

అందుమీదట దేవుడుగారు దయతలిచి, చెరువులోంచి ఢాం... అంటూ లేచి పైకొచ్చేరు. చేతిలో ఓ బంగారు గొడ్డలితో సహా!

"థాంక్యూ... థాంక్యూ... దేవుడుగారూ! కానీ, ఈ బంగారు గొడ్డలి నాదికాదే!" అని మళ్లీ భోరుమన్నాడుట, ఆ కట్టెలు కొట్టుకునేవాడు.

"నా బంగారు గొడ్డలీ, నా నవరత్నాల గొడ్డలీ... అంటూ నువ్వింతసేపూ ఏడ్చిందే మిత్రా... రాస్కెల్!... సరే, ఉండు" అంటూ దేవుడుగారు చెరువులో మునిగి, కాసేపట్లో చేతిలో నవరత్నాలు పొదిగిన ఓ వెండి గొడ్డలితో సహా ఏతెంచేరుట!

మనవాడున్నూ అదిచూసి, లెంపలేసుకుని, "అది నాది కాదుస్వామీ!... అయినా వెండిగొడ్డలితో నరికితే కట్టెలు ఏం తెగుతాయి!" అంటూ భోరున ఏడ్వసాగేడుట.

అందుమీదట, దేవుడుగారు శ్రమ అనుకోకుండా మళ్లీ ధభీమని చెరువులోకి దూకి... ఈసారి ఆ కట్టెలు కొట్టుకునేవాడి అసలు సిసలు ఇనుపగొడ్డలి సహితంగా పైకొచ్చేరు.

వచ్చి..

"భక్తా, నీ నిజాయితీకి మెచ్చితిని! వెయ్యేళ్లపాటు ఇలాగే నిజాయితీగా ఈ గొడ్డలితోనే కట్టెలు కొట్టుకుంటూ, పిల్లా, పాపల్తో కలిసి కలో, గంజో తాగుతూ, ఎలాగోలా చావకుండా బ్రతుకు" అని దీవించి, ఆ మూడుగొడ్డళ్లూ వాడికే బహూకరించి, మళ్లీ చెరువులోకి దూకి మాయమయ్యేరు.

ఇది మనం ఎపుడో, మరీ చిన్నప్పుడు క్లాసు పుస్తకాల్లో చదువుకున్న కథ.

* * *

ఆ తర్వాత ఆ కట్టెలు కొట్టుకునేవాడి మనవడి మునిమనవడు ఈ కథ వినగా వాడికో బ్రహ్మాండమైన ఐడియా వచ్చేసింది. పాపం, వాడసలే మాట్నీషోలకూ, బీడీలకూ కూడా డబ్బులు చాలక ఇబ్బందుల్లో ఉన్నాడప్పుడు.

ఇంకేం!... వెంటనే అటకమీదున్న తుప్పుపట్టిన ఇనపగొడ్డలిని భుజాన్నేసుకుని అర్జంటుగా సదరు చెరువు దగ్గరికి పరుగెత్తేడు. కష్టపడి చెట్టెక్కి, సదరు గొడ్డల్నికాస్తా దభీమని చెరువులోకి విసిరేసేడు.

విసిరేసి తీరిగ్గా కూర్చుని ఏడుపు ప్రారంభించేడు.

కానీ, గంటన్నర గడచినా దేవుడుగారు ప్రత్యక్షం కాలేదు.

వీడికేమో ఏడ్చి, ఏడ్చి, బోరెత్తి, వళ్లుమండి, దేవుడుగారు నిద్రపోతున్నారేమోనని, ఓ పెద్ద చెట్టుకొమ్మ విరిచి, ధభీమని చెరువులో పడేలా విసిరేడు.

ఆ దెబ్బకు దేవుడుగారు నిద్రలేచి పైకొచ్చేరు, ఆవులిస్తూ. కాని, ఆయన చేతుల్లో బంగారు గొడ్డలీ లేదు, వెండిగొడ్డలీ లేదు.

"నా గొడ్డలి, నా బంగారు గొడ్డలి" అంటూ వీడు రాగయుక్తంగా ఏడ్వసాగేడు.

వీడితో టైం వేస్టెందుకులెమ్మని దేవుడుగారు ఓ బంగారు గొడ్డలిని తెచ్చి "ఇది నీదేగా! సరే, తీసుకో" అన్నారుట.

వాడున్నూ ఎగిరి గంతేసి, తక్షణం ఆ బంగారు గొడ్డలిని అందుకుని భుజాన్నేసుకుని, థాంక్సన్నా చెప్పకుండా పరుగెత్తబోయేడుట.

అందుకు ఆగ్రహించిన దేవుడుగారు, "ఔరా! ఢింభకా! అది నీది కాదుగదరా! దర్జాగా భుజాన్నేసుకుపోతున్నావే, నా పర్మిషన్ లేకుండా?" అంటూ వెంటపడ్డారుట.

"అవును స్వామీ! ఇది నాది కాదు, నిజమే కానీ, మా మూత్తాతగారి స్టోరీ గుర్తుందిలెండి. నేనిది నా గొడ్డలికాదనటం... మీరు మళ్లీ చెరువులో మునగటం... ఓ వెండిగొడ్డలితో పైకి రావటం... నేనేమో, అది నాది కాదనటం, మీరు మళ్లీ చెరువులో మునగటం... ఈ శ్రమంతా ఎందుకు స్వామీ! మీకు జలుబు చేస్తుందేమోననే భయంతోనే మీకోసం ఆ రెండు గొడ్డళ్లనూ త్యాగం చేసేసి దీనితోనే సరిపెట్టుకుంటున్నాను" అంటూ వాడు దేవుడుగారి జవాబుకోసం చూడకుండానే, కల్లుపాకల కేసి పరుగెత్తేడు.

ఇది ఆ తరువాత చాలా కాలానికి జనశ్రుతిగా వినవచ్చిన కథ.

* * *

సరే!... ఇవన్నీ పాతకథలు. ప్రస్తుతం మనమున్నది ప్రజాస్వామ్యయుగం, మహామేధావి ఇందిరాజీ వరవడిలో పురోగమిస్తూన్న వారసత్వ రాజకీయాల యుగం.

ఈ కాలంలో... మహా నిజాయతీపరుణ్ణనుకునే ఓ మహాభక్తుడు గారికి అనుకోకుండా ఓ టోపీ దొరికింది. అయితే సదరు టోపీని అప్పటికే ఎందరెందరో టోపీదాసులు వాడి, వాడి ఉండటాన భరించలేనంతగా కంపుకొడుతోంది. అందుకని మన భక్తుడుగారు సరాసరి సదరు చెరువు దగ్గరికే వెళ్లి, టోపీని ఉతికి ఆరేద్దామనుకుంటూనే, చెట్టుకింద చతికిలబడి నిద్దరోయేరు.

ఈలోగా ఆ టోపీ గాలికి ఎగిరెళ్లి చెరువులో పడింది. దేవుడుగారున్నూ, అర్జంటుగా చెరు

వులోంచి రామ్మంటూ ప్రత్యక్షమయ్యేరు, ఓ వజ్రకిరీటంతో సహా!

"సదరు "రాం"కు మన భక్తుడుగారు ఉలిక్కిపడి నిద్రలేచేరు. ఈయనగారేమో ఎందరెందరో దేవుళ్ల వేషాలేసి, డైలాగులు చెప్పి ఉన్న పుణ్యపురుషులు. కనుక... ఏమాత్రం భయపడకుండా సదరు వజ్రకిరీటాన్ని తీసుకుని జోలెలో వేసేసుకున్నారు.

"అదేమిటి బ్రదర్...! అది నీదికాదు గదా? " అన్నారు దేవుడుగారు ఆశ్చర్యపోతూ!

"అయితేనేం స్వామీ! ఎలాగూ కష్టపడి మోసుకువచ్చేరుగదా. ఎందుకు కాదనాలి! మా అబ్బాయికి పనికొస్తుందిలెండి" అన్నారు భక్తుడుగారు సవినయంగా.

సరే!... దేవుడుగారు సాంప్రదాయప్రకారం మళ్లీ చెరువులోకి దూకి, ఈసారి బంగారు కిరీటం తెచ్చేరు.

భక్తుడుగారు అదిన్నీ అందుకుని, జోలెలో వేసేసుకున్నారు... 'మా అల్లుడికి పనికొస్తుందిలెండి" అంటూ!

దేవుడుగారున్నూ విసుక్కోకుండా, ఆనవాయితీగా మళ్లీ చెరువులోకిదూకి ఈసారి ఓ వెండి కిరీటంతో సహా పైకొచ్చేరు.

భక్తుడుగారు దాన్నీ ఆప్యాయంగా అందుకుని, జోలెలో భద్రం చేసేసేరు "మా రెండోఅల్లుడు సరదాపడుతున్నాడులెండి" అంటూ.

దేవుడుగారు "ఔరా" అనుకుంటూ యథాప్రకారం మళ్లీ చెరువులోకి దూకేరు. కానీ, పైకి రాలేదు, ఎంతసేపయినా!

ఆశ్చర్యపోయిన భక్తుడుగారు అష్టోత్తరాలు వగైరా గుర్తున్నవన్నీ జపించసాగేరు భీకరంగా.

దేవుడుగారు వచ్చి "నాయనా, మునిగీ, లేచి, గొడ్డళ్లూ, కిరీటాలూ తెచ్చీ, ఇచ్చీ అలిసిపోయున్నాను. ఇంకా ఏమిటీ? " అని ప్రశ్నించేరు నీరసంగా.

"మరి నా టోపీ...? స్వామీ..." అంటూ నసిగేరు భక్తుడుగారు.

"బ్రదర్! నువ్విప్పటికే చాలామందికి కిరీటాలు పోగేసేవు. రేపు వాళ్లందరూ రాజ్యం ఏలనుండగా ఇంకా నీకే టోపీల అవసరం ఏమిటీ? ... హాయిగా విశ్రాంతి తీసుకో..." అంటూనే, దేవుడుగారు ఎంతయినా భక్తవత్సలుడు గనుక, తన ఖరీదైన పట్టు అంగోస్త్రం తీసి, భక్తుడిగారి నెత్తినవేసి... అంతర్ధానమయ్యేరు.

*(ఈనాడు, 12.10.1983)*

☆